

కడప సెంట్రల్ జైలు.. వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. తరచూ జైలులో ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు, సిగరెట్లు, గుట్కాలు లభించడం.. ఖైదీల మధ్య గొడవలు.. సిబ్బంది, అధికారుల మధ్య ఆధిపత్య పోరు.. వెరశి నిత్యం ఏదో ఒక సమస్యతో ఈ జైలు వార్తల్లో నిలవడం విశేషం. ఈ నేపథ్యంలో కొందరు సిబ్బందిపై ఉన్నతాధికారులు వేటు వేసిన విషయం తెలిసిందే. దీనికి తోడు సిబ్బంది కొరత.. ఓ సమస్యగా మారింది. చేసేది లేక ఉన్నవారితోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఏదేమైనా సెంట్రల్ జైలులో అధికారుల పర్యవేక్షణ కొరవడుతున్నట్లు విమర్శలున్నాయి.

రేపు జిల్లా నేతలతో చంద్రబాబు భేటీ

● ఉప ఎన్నికల్లో విజయంపై అభినందనలు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయదుందుబి మోగించింది. ముఖ్యంగా పులివెందులలో జగన్‌పార్టీకి డిపాజిట్ దక్కలేదు. రాష్ట్రంలోనే ఈ విజయం కూటమిలో నూతన ఉత్సాహం నింపింది. పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేయడం ఎన్నో ఏళ్ల కల. అయితే నేడు అది నెరవేరింది. పులివెందుల, ఒంటిమిట్ట విజయానికి కూటమి నేతలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ గెలుపు టీడీపీకి మంచి కిక్‌నివ్వడంతో పాటు జిల్లా నేతలకు మైలేజ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా నేతలకు సీఎం చంద్రబాబు నుంచి పిలుపువచ్చింది. పులివెందుల ఎన్నికల్లో కీరోల్‌గా ఉన్న బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి కూడా ప్రత్యేక ఆహ్వానం అందింది. పులివెందుల, ఒంటిమిట్ట గెలుపులో కీలకపాత్ర పోషించిన కడప, అన్నమయ్య జిల్లాల టీడీపీ నేతలతో మంగళవారం సాయంత్రం చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ ఉప ఎన్నికతో వదిలేయకుండా టీడీపీని పులివెందులలో మరింత పటిష్ఠం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 7 సీట్లు కట్టబెట్టారు. ఉప ఎన్నికల్లో కూడా రెండు స్థానాల్లో టీడీపీని గెలిపించారు. ఈ నేపథ్యంలో జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించేందుకు జిల్లా నేతలతో కలిసి సీఎం చంద్రబాబును కలుస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో వెల్లడించారు. కాగా మంగళవారం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో సీఎంను కలవడంలో తమకు ఇంకా స్పష్టత రాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.



కడప సెంట్రల్ జైలు

వివాదాలకు కేరాఫ్..

● ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు
● కొరవడుతోన్న అధికారుల పర్యవేక్షణ
● వేధిస్తున్న సిబ్బంది కొరత ● ఉన్నవారితోనే విధులు

కడప సెంట్రల్ జైలు

కడప క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో ఎందరో కరుడు గట్టిన నేరస్థులు శిక్ష అనుభవించిన సందర్భాలు ఉన్నాయి. ఇక్కడికి వివిధ రకాల నేరాలు చేసిన ఖైదీలు వస్తుంటారు. వారిలో కొందరి ప్రవర్తన భయానకంగా ఉంటుంది. వారి మనస్తత్వాలు, ఆలోచనలు వేరుగా ఉంటాయి. తరచూ ఈ జైలులో ఖైదీల మధ్య గొడవలు జరుగుతుంటాయి. అలాంటి సమయాల్లో జైలు సిబ్బంది, అధికారుల పాత్ర కీలకం. కానీ ఇక్కడ సిబ్బంది నిత్యం వివాదాల్లో నిలుస్తుంటారు. ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు, సిగరెట్లు, గుట్కాలు లభించడం.. ఖైదీల మధ్య గొడవలు.. సిబ్బంది, అధికారుల మధ్య ఆధిపత్య పోరుతో సతమతమవుతోంది. ఇక్కడ సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఖైదీలపై సరైన నిఘా ఉంచలేకున్నారు. ఒకవేళ ఖైదీల సంఖ్య పెరిగితే మాత్రం ఇప్పుడున్న సిబ్బంది ఏ మాత్రం సరిపోరని చెబుతున్నారు. ఇటీవల కడప సెంట్రల్ జైలులో ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు లభించాయి. తరచూ ఒక ఖైదీ వద్దనే సెల్‌ఫోన్లు దొరకడంతో ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విచారణ చేపట్టి ఐదుగురు సిబ్బందిపై వేటు వేశారు. ఉన్న సిబ్బందితోనే అరకొర విధులు నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారు. దీనికి తోడు సిబ్బంది, అధికారుల మధ్య ఆధిపత్యపోరు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. కొందరు సిబ్బంది వయసు పైబడి అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

కడప కేంద్ర కారాగారంలో 950 మంది వరకు ఖైదీలు ఉండేందుకు సౌకర్యంగా ఉంది. అయితే ఇక్కడ రిమాండు ఖైదీలు దాదాపు 240 మంది ఉండగా, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు దాదాపు 400 మందికి పైగానే ఉన్నారు. వీరందరినీ జైలు వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు పర్యవేక్షిస్తుంటారు. ఏదైనా సమస్య జరిగినా ఖైదీల మధ్య గొడవలు జరిగినా సిబ్బంది అక్కడికి చేరుకుని పరిష్కరిస్తారు. అయితే నేరాలు చేసి జైలుశిక్ష అనుభవిస్తున్న వారిని అదుపు చేయాలంటే కష్టతరం. నేరస్థుల మనస్తత్వాలు వేర్వేరుగా ఉంటాయి. అలాంటి వారి మధ్య కాపలాగా ఉండాలంటే వీరు కూడా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉంది. సిబ్బంది కొరత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నప్పటికీ కడప సెంట్రల్ జైలులో మాత్రం ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఖైదీల వద్ద తరచూ సెల్‌ఫోన్లు దొరుకుతున్నప్పటికీ వాటిని కట్టడి చేయడంలో పర్యవేక్షణ లోపం సిబ్బందిలో స్పష్టంగా కనిపిస్తున్నట్లు విమర్శలున్నాయి.

ఖైదీతో రూ.20 వేల ఫోన్‌పే

ఓ డిప్యూటీ జైలరు ఓ ఖైదీ వద్దనే దాదాపు రూ.20 వేలు ఫోన్‌పే వేయించుకుని సెల్‌ఫోను అందించినట్లు ఆరోపణలున్నాయి. అయితే అప్పటి జైలు ఉన్నతాధికారి రిపోర్టు రాయడంతో తిరిగి ఆ డబ్బును వారి కుటుంబానికి పంపించినట్లు సమాచారం. దీనిపై విచారణ జరగకుండానే కర్నూలుకు చెందిన ఓ అధికారి ఆ ఖైదీ రిలీజ్ అయిన వెంటనే అతన్ని బెదిరించి ఆ డిప్యూటీ జైలరుకు అనుకూలంగా రిపోర్టు రాశారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. తాము తప్పు చేయనప్పటికీ విచారణ అధికారి ఉద్దేశ్యపూర్వకంగా గతంలో సహకరించని వారిపై కూడా సస్పెన్షన్ వేటు వేశారంటూ ఆ శాఖ సిబ్బందే ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సెంట్రల్ జైలు ఆవరణంలో ఉన్న పెట్రోలు బంకులో లక్షల్లో డబ్బు స్వాహా అయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు మెమో అందించినట్లు తెలుస్తోంది. చేసేది లేక.. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోలేక.. ఆ సిబ్బందితోనే విధులు కొనసాగిస్తూ వస్తున్నారు.

సిబ్బంది సగమే...

కడప సెంట్రల్ జైలులో ఒకరు పర్యవేక్షణాధికారి ఉండగా, ఇరువురు ఉప పర్యవేక్షణాధికారులు ఉండాలి. అయితే ఇటీవల ఖైదీ వద్ద సెల్‌ఫోన్లు దొరకడంతో ఇరువురు ఉప పర్యవేక్షణాధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ఓ ఉప పర్యవేక్షణాధికారి ఇన్‌చార్జ్ విధులు నిర్వహిస్తున్నారు. ఇక సెంట్రల్ జైలు వార్డెన్‌లుగా 134 మంది ఉండాలి.. కానీ కేవలం 72 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం 62 వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హెడ్‌వార్డెన్ 38 ఉండగా 37 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఇక జైలుకు సంబంధించి వాహనడ్రైవరు పోస్టు ఖాళీగానే ఉంది. డిప్యూటీ జైలరు, ఒక క్యాషియర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఖైదీల మధ్య తరచూ జైల్లో వివాదాలు, గొడవలు జరుగుతుంటాయి. కొంత మంది సిబ్బంది నేరస్థులకు గుట్కా, సిగరెట్, సెల్‌ఫోన్లు చేరవేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని కట్టడి చేయాలంటే పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఖాళీల విషయమై నివేదిక పంపించాం



కడప సెంట్రల్ జైలులో సిబ్బంది కొరత ఉంది. ఉన్నవారితో విధులు నిర్వహిస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది కలగకుండా వారికి డ్యూటీలు వేస్తున్నాం. జైల్లో ఉన్న ఖాళీల భర్తీ విషయమై నివేదికను జైళ్ల శాఖ డీజీకి పంపించాం.

- రాజేశ్వర్‌రావు, సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి

మయన్మార్‌లో కడప యువకుడికి చిత్రహింసలు

● సోషల్ మీడియాలో పోస్టు చేసిన యువకుడు

కడప క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు మయన్మార్ దేశం అడ్డాగా మారినట్లు తెలుస్తోంది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) యాప్‌తో వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ ద్వారా లింకులు పంపించి మన అకౌంటులోని డబ్బులు లాగేస్తున్నట్లు ఓ బాధితుడు పోస్టు చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఆ వీడియోలో బాధితుడు మాట్లాడుతూ "మనరాష్ట్రం, దేశానికి చెందిన వారిని ఉద్యోగాల పేరుతో అక్కడికి తీసుకెళ్లి కాల్‌సెంటరులో అమ్మాయిల మాదిరి ఫోన్లు చేయించి దోచుకుంటున్నారు. ఇలాంటి బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది ఉన్నారు. కడపకు చెందిన నేను తెలంగాణకు చెందిన మరో వ్యక్తితో కలిసి డేటా ఎంట్రీ ఆపరేటరు ఉద్యోగం పేరుతో లక్ష రూపాయలు జీతం వస్తుందనే ఆశతో థాయిలాండ్‌కు.. అక్కడి నుంచి మయన్మార్ దేశానికి వెళ్లాను. అక్కడ ఓ కార్యాలయంలో పెట్టి రకరకాల దేశాల్లో ఉన్న తెలుగు వారికి మెసేజ్‌లు పెట్టించి వారి అకౌంట్ల ద్వారా డబ్బులు వేయించుకుంటున్నారు. వారి చెప్పిన పనిచేయకపోతే ఆ దేశస్థులు చిత్రహింసలకు గురి చేస్తారు. వారి టార్చర్ భరించలేకపోతే 15 వేల డాలర్లు చెల్లించాలి" అని బాధితుడు సామాజిక మాధ్యమంలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో భాగంగా తాను వేధింపులు భరించలేక కుటుంబ సభ్యులకు చెప్పడంతో దాదాపు రూ.7లక్షలు వారికి చెల్లించడంతో తనను స్వగ్రామానికి పంపించినట్లు వెల్లడించాడు. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన ఎంత మంది ఉద్యోగాల కోసం వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్నారనేది స్పష్టత రాలేదు. బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారి గుట్టు రట్టు చేసే అవకాశం ఉంది. కాగా ఈ విషయంపై జిల్లా పోలీసులు, సైబర్ పోలీసులను వివరణ అడగ్గా తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం

● డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9-30 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం, 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ జరుగుతుందని అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే మీ కోసం కాల్‌సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

గండికోటలో 20.38 టీఎంసీల నీటిమట్టం 7

గండిలో తగ్గని భక్తుల రద్దీ



గండిక్షేత్రంలో భక్తుల రద్దీ

చక్రాయపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆదివారం గండిక్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా భక్తులు అధికంగా ఇక్కడికి చేరుకున్నారు. అయితే ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగడం విశేషం. వర్షం ఒక వైపు వస్తున్నా మరోవైపు దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. అలాగే గండి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన పథకం వద్ద భారీ క్యూలైన్ ఏర్పడింది. కమిటీ సభ్యులు దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్‌లు వచ్చిన భక్తులకు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా భక్తులు కందుల రాజమోహన్‌రెడ్డి నిర్మించిన కళ్యాణమండపం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం వేసిన షెడ్లలో భక్తులు తలదాచుకున్నారు.


వైకల్యశాతంలో తేడాలుంటే అప్పీలుకు వెళ్లొచ్చు

● డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వైకల్య శాతంలో తేడాలుంటే అప్పీలుకు వెళ్లవచ్చని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద, బలహీన వర్గాలకు, వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు భరోసా కల్పిస్తూ ప్రతినెలా అందిస్తున్న పింఛన్లలో అక్రమార్కులను ఏరివేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో ప్రధానంగా వికలత్వ పింఛన్లు పొందుతున్న వారిపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి నుంచి ప్రత్యేక వైద్య బృందాల ద్వారా పునఃపరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఉన్న వైకల్యశాతం, వ్యాధితీవ్రత తగ్గడం ద్వారా నిర్దేశిత 40 శాతం నుంచి 85 శాతం వైకల్యం తీవ్రమైన అనారోగ్యం లేకున్నా రూ.15 వేలు పింఛన్లు పొందుతున్నారు. ఇలాంటి వారి వికలత్వం నిబంధనల మేరకు ఉందా, లేదా అని పరిశీలించి 60 సంవత్సరాలు పైబడ్డ వారిని వృద్ధుల కేటగిరీలోకి మార్చి రూ.4వేల పింఛనుకు చేర్చినట్లు తెలిపారు. అదేవిధంగా 40 శాతం తక్కువ వికలత్వం ఉండి, 60 ఏళ్ల వయసు రానివారిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఆగస్టు 14 నుంచి 25వ తేది నాటికి పూర్తి చేయాలని ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికి కూడా వైద్యబృందాలు నిర్ధారించిన వైకల్యశాతంలో ఏవైనా తేడాలుంటే లబ్ధిదారులు తిరిగి అప్పీలు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. వికలత్వ పింఛను రద్దయిన వారు పాత సదరన్ సర్టిఫికెట్ పింఛను రద్దుపరిచిన నోటీసును తీసుకుని రిమ్స్, జిల్లా ఆసుపత్రి, వేరే ఆసుపత్రులకు వెళ్లి మాన్యువల్ సర్టిఫికెట్ కోసం సంబంధిత డాక్టరుతో సర్టిఫికెట్లు పొందాలి. మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు మిగిలిన పత్రాలు కలిపి ఎంపీడీవో, లేదా మున్సిపల్ కమిషనరు వారికి అప్పీలు సమర్పించాలని సూచించారు. అప్పీలును పింఛను రద్దు నోటీసు అందించిన 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవాలి. ఆలస్యం చేస్తే అప్పీలు చేసుకునే అవకాశం కోల్పోతారని వివరించారు.

రిమాండ్ ఖైదీ కోసం పోలీసుల వేట


● జైలు సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలకు రంగం సిద్ధం



ప్రొద్దుటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సబ్ జైలు నుంచి గోడలు దూకి పరారైన రిమాండ్ ఖైదీ మహ్మద్ రఫీ కోసం పోలీసులు వేట మొదలుపెట్టారు. మరో వైపు సిబ్బంది నిర్లక్ష్యంపై జైలు అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. అయితే అక్కడ జైలు సూపరింటెండెంట్ రెండునెలల క్రితం బదిలీపై వెళ్లడం.. ఆ స్థానంలో మరొకరిని భర్తీ చేయకపోవడంతో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఉంటున్నారు. అంతేకాకుండా సిబ్బంది కూడా తక్కువగా ఉండటంతో క్షణాల్లో వారి కళ్లుగప్పి గోడ దూకి మహ్మద్‌రఫీ పరారవ్వడానికి ఆస్కారం ఏర్పడినట్లయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. జైలుకు వచ్చి రావడంతోనే అతని ప్లాన్ మొదలైందని జరిగిన సంఘటన బట్టి తెలుస్తోంది. గోడలకు వెంటిలేటర్ కిటికీలు ఉండటం కూడా అతను వెళ్లేందుకు మార్గం సుగమం చేసిందని అభిప్రాయ పడుతున్నారు. దీంతో వెంటనే ఆ వెంటిలేటర్ కిటికీలను మూసివేయించే పనులు జైలు అధికారులు చేపట్టారు.

మహ్మద్ రఫీ కరుడుగట్టిన నేరస్థుడు కావడంతో తాత్కాలికంగా ఎక్కడైనా తలదాచుకున్నాడా లేదా మళ్లీ ఎక్కడైనా దొంగతనాలకు స్కెచ్ వేశాడా అనే కోణంగా పోలీసులు ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా మహ్మద్ రఫీకి సంబంధించి పరిచయం ఉన్న వ్యక్తులను విచారిస్తున్నట్లు సమాచారం. అతను మళ్లీ ఎక్కడైనా దొంగతనాలు మొదలు పెడతాడేమోనని డిపార్ట్‌మెంటును జిల్లాలోని అన్ని స్టేషన్లలో అలర్ట్ చేశారు. గతంలో దొంగతనాలకు పాల్పడిన ప్రాంతాలు, అక్కడ అతనికి సంబంధించి వివరాలపై పోలీసులు విచారిస్తున్నారు. ఇదిలా వుండగా మహమ్మద్‌రఫీ 2021లో జమ్మలమడుగు జైలు నుంచి కూడా తప్పించుకొని పారిపోయాడనే ప్రచారంలో వాస్తవం లేదని జిల్లా సబ్‌జైళ్ల అధికారి ఎస్.అమర్‌బాషా వివరణ ఇచ్చారు. 2020లో జమ్మలమడుగులో రిమాండ్ ఖైదీగా ఉండిన మాట వాస్తవమేనని, అయితే అతనికి కోర్టు ఉత్తర్వుల మేరకు బెయిల్ వచ్చి విడుదలైనట్లు తెలిపారు. ఈ ఖైదీ జమ్మలమడుగు జైలులో ఉండగా పీటీ వారెంట్‌పై విచారణకు అతన్ని తీసుకెళ్లాలని పోలీసులు వస్తే అప్పటికే అతను విడుదలైనట్లు వివరించారు.

గండికోట ప్రాజెక్టులో 20.38 టీఎంసీల నీటిమట్టం


గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. 20.38 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోటప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 10,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటిని విడుదల చేస్తున్నామన్నారు. కాగా ఆదివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 12,900 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 11,000 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా పైడిపాలెం రిజర్వాయిర్‌కు 500 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

కొందరికి ఖేదం... మరికొందరికి మోదం

- కుప్పకూలిన ధరలతో కుదేలైన బొప్పాయి, మామిడి రైతులు
- రికార్డు స్థాయిలో ధరలతో లాభాల బాటలో అరటి రైతులు
- 4 నెలలుగా కిలో రూ.17 అరటి ధరలు
- 15 రోజుల్లోనే కిలో రూ.16 నుంచి రూ.8కి పడిపోయిన బొప్పాయి ధరలు


కోడూరులో బొప్పాయి పంటను తొలగిస్తున్న రైతులు (ఫైల్)


మామిడి చెట్లను కొట్టేసి వంటచెరకుగాఎగుమతి చేస్తున్న రైతులు

రాజంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోంది. ప్రభుత్వం ఉచిత కరెంటు, అనేక సబ్సిడీలు, పంట రుణాలు, సబ్సిడీ పనిముట్లు, బ్యాంకు రుణాలు ఎన్ని అందించినా... అన్నదాతలు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో కుదేలవుతున్నారు. పండ్లతోటలకు పెట్టింది పేరైన రాజంపేట డివిజన్‌లో లక్ష ఎకరాల్లో పండ్లతోటలు సాగు చేస్తున్నారు. మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ పంటలను విరివిగా సాగు చేస్తూ వాటిపైనే జీవనం సాగిస్తుంటారు. ప్రస్తుతం గతనెల చివరి నుంచి బొప్పాయ పంట దిగుబడి ప్రారంభమైంది. దిగుబడి ప్రారంభంలో కిలో బొప్పాయి ధర ఏకంగా రూ.16 పలికింది. భారీస్థాయిలో డిమాం డ్ ఉండడంతో రైతులు ఆనందపడ్డారు. ఇంతలో ఏమైందో ఏమోకాని దిగుబడి మొదలై కాయలు ఒక్కసారిగా కోతలు కోయడంతో డిమాండ్ తగ్గింది. కిలో రూ.16 నుంచి రూ.8కి పడిపోయింది. ధరల పతనంపై రైతులు ఆందోళన చేసినా.. ఏకంగా బొప్పాయి వ్యాపారులు, దళారులు రైతులతో కలెక్టర్ మాట్లాడినా ప్రయోజనం లేకుం డా పోయింది. కిలో రూ.8కి కొనే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఈ సమయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో రాజంపేట సబ్‌కలెక్టర్ స్పందించి ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, ఉద్యానవన అధికారుల పర్యవేక్షణలో సమావేశాలు నిర్వహించి రైతులకు భరోసా ఇచ్చా రు. ఏకంగా ధరలు తగ్గిస్తే వెంటనే చర్యలు చేపడతామం టూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. అయినా బొప్పాయ పంటను కిలో రూ.8కు కొనడంలో కూడా వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. కారణం పంటదిగుబడి ఒకేసారి రావడంతో దిగుబడికి తగ్గట్టు డిమాండ్ లేకపోవడంతో ధరలు పతనమయ్యాయి.

అరటి రైతులకు అధిక లాభాలు

ఈ ఏడాది అరటి రైతుల పంట పండింది. గత నాలుగు నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. రాజంపేట డివిజన్ ప్రాంతంలో దాదాపు 30 వేల ఎకరాల్లో అరటి సాగవుతోంది. నాలుగు నెలల నుంచి కిలో రూ.17 ధర నిలకడగా సాగుతోంది. గత ఐదేళ్ల కిందట ఇదే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కూడా కిలో ధర రూ.17 నాలుగు నెలలుగా ఉండడంతో గెలకు కనీసం రూ.500 రూపాయలు ఆదాయం వస్తోంది. ఒక ఎకరాకు వెయ్యి చెట్లకు 4 లక్షల నుంచి 5 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను రూ.2లక్షల నుంచి 3లక్షల ఆదాయం వస్తోంది. దీంతో అరటి రైతులు ఆనందంలో ఉన్నారు. ఇక ఈ యేడా ది వేసవికాలంలో ఈదురుగాలులు లేకపోవడంతో అరటి రైతులకు బాగా కలిసి వస్తోంది.


రాజంపేట ప్రాంతంలో పెద్దత్తున సాగైన అరటి

బొప్పాయ పంటను అర్ధాంతరంగా తీసివేసి...

రాజంపేట డివజన్‌లో 30వేల ఎకరాల్లో బొప్పాయ పంట పండుతోంది. ఈ స్థితిలో భారీఎత్తున ధర పడిపోవడంతో ఏకంగా వంద కోట్ల రూపాయల ఆదాయాన్ని రైతులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. చేసేది లేక కొందరు రైతులు బొప్పాయి పంటను అర్ధాంతరంగా తీసివేసి ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే స్థితిలో గత నాలుగు నెలలుగా సాగిన మామిడి పంట వ్యాపారం కోడూరు నుంచే రూ.200 కోట్ల వరకు జరగాల్సి ఉండగా డిమాండ్ లేక... కాయలను రోడ్లపై పారవేసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ ఇచ్చినా కోసిన కాయలకు కూలీ ఖర్చులు కూడా లేకపోవడంతో రూ.200 కోట్ల వ్యాపారం 50 కోట్లకు పడిపోయంది. 25 వేల ఎకరాల్లో సాగయ్యే మామిడి పంట ఎందుకు కొరగాకుండాపోయింది. దీంతో మామిడి రైతులు ఏమి చేయలేక చెట్లను తొలగించి.. ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపుతున్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి... సౌదీలో కుమారకాల్వ వాసి మృతి


నూర్ బాష (ఫైల్)

చక్రాయపేట,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించు కునేందుకు కువైట్‌కు వెళ్లిన మండలంలోని కుమారకాల్వ గ్రామానికి చెందినషేక్ నూర్ బాష (38) మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకెళితే... చక్రాయపేట మండలంలోని కుమారకాల్వ గ్రామానికి చెందిన నూర్‌బాష బతుకు దెరువుకోసం 15 సంవత్సరాలుగా గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాకు వెళ్లి... ఒక కంపెనీలో కార్మి కుడిగా పనిచేస్తున్నాడు. సెలవుపై ఇండియాకు వచ్చి దాదాపు ఐదు నెలల క్రితం మళ్లీ సౌదీకి వెళ్లిపోయాడు. ఆదివారం 9 గంట లకు (ఇండియా కాలమానం ప్రకారం 12.30) నూర్ బాష డ్యూటీ కోసం సిద్ధమయ్యేందుకు తన గదిలో ఉన్న బాత్రూంలోకి కాలకృ త్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కిందపడిపోయి మృతి చెందాడు. ఈ విషయం అక్కడ ఉన్న తోటి స్నేహితులు తెలిపారన్నారు. నూర్ బాష మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి త్వరగా తెప్పించేం దుకు రాష్ట్రప్రభుత్వం సాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 17 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నుంచి వనిపెంటకు వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులో మోటర్‌సైకిల్ అదుపు తప్పి కింద పడటంతో గుగ్గిళ్ల జగదీష్ (18) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు... శనివా రం రాత్రి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మకాలనీకి చెందిన జగదీష్ పనిమీద గంజికుంటకు వెళ్లి తిరిగి వస్తుండగా మోటర్‌సైకిల్ అదుపు తప్పి కల్వర్ట్‌లో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలై అక్కిడకక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్వరంతో విద్యార్థి మృతి


బింగి రఘువరన్

వేంపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బింగి రఘువరన్ (8) అనే విద్యార్థి తీవ్ర జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బింగి ఓబులేసు, భారతిలు స్థానిక శ్రీరామ్ నగర్‌లో నివాసముంటూ కూలిపనులు చేసుకునేవారు. వీరి ఒక్క గానొక్క కుమారుడు రఘువరన్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతు న్నాడు. కాగా, ఇంటి చుట్టుపక్కల చెత్తా చెదారం పేరుకుపోయి పారిశుధ్యం అధ్వాన్నంగా తయారై దుర్గంధం వెద జల్లుతోంది. దీంతో వారం క్రితం రఘువరన్‌కు జ్వరం రాగా ఆసు పత్రిలో చికిత్స చేర్పించగా.. ఆదివారం ఉన్నట్లుండి మృతి చెందాడని బంధువులు చెబుతు న్నారు. అపరిశుభ్రత వల్ల ఈగలు, దోమ లు ఎక్కువై జ్వరం వచ్చి మృతిచెందాడని బంధువులు వాపోయారు.

కారు, స్కూటర్ ఢీ - ఒకరికి గాయాలు

ఖాజీపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప, కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లె చెరువు వద్ద కారు స్కూటర్‌ను ఢీకొన్న సంఘటనలో మొయిళ్ల కాల్వ దివాకర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... పాటిమీదపల్లె గ్రామానికి చెందిన దివాకర్ ఆదివారం పెట్రోలు కోసం వెళ్లి తీసుకుని వస్తుండగా.. మైదుకూరు నుంచి కడప వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో దివాకర్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

- 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం పిలుపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 7ను అమలు చేసి డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాతపింఛన్ వర్తింపచేయాలనే డిమాండ్‌తో ఆగస్టు 25వ తేదీ సోమవారం వియవాడ ధర్నా చౌక్ వద్దచేపట్టే మహాధర్నా కార్యక్రమానికి కడప జిలల్లాలోని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొని వియవంతం చేయాలని జిల్లా డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం పిలుపునిచ్చింది. ఆదివారం కడపనగరం ఎన్జీఓ భవన్‌లో మహాధర్నా పోస్టర్‌ను డీఎస్సీ-2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్ ఆధ్వర్యంలో ఏపీఎన్‌జీఓ జిలల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శ్రీనివాసులు, డి.రవికుమార్, పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, ఏపీటీఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ జిలల్లా కోశాధికారి కె.నరసింహారావు, వైఎస్ఆర్‌టీఏ రాష్ట్ర నాయకులు సజ్జల రమణారెడ్డి, ఏపీటీఎఫ్ 257 జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి, ఆపస్ జిల్లా ఉపాధ్యాయులు శ్రీనివాసులు మరియు డీఎస్సీ 2003 టీచర్స్ ఫారం జిల్లా కన్వీనర్లు ఉదయభాస్కర్, కె.వీరప్రతాప్, శోభారాణి ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు అంటే సెప్టెంబర్ 1, 2004 ముందే ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయి ప్రభుత్వ పాలనాపరమైన విధానాల వలన పోస్టింగ్ ఆలస్యమైన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పింఛన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కడప జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరు పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

బి.కొత్తకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని పాశం వీధిలో వెలసిన సత్యసాయి బాబా మంది రంలో ఆదివారం నూతనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ ఏ ర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్య క్షుడు వరప్రసాద్, కన్వీనర్ శేఖర్‌బాబు, సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీపాణి పాల్గొన్నారు.

ఈశ్వరీదేవిమాత ఆలయ నిర్మాణానికి విరాళం


ఈశ్వరీదేవి అమ్మవారి పటం అందుకుంటున్న దాతలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి మాత ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు విరాళంగా దాతలు అందజేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట వాసి కె.శ్రీనివాసులు ఆచారి కుటుంబ సభ్యులు మఠాధిపతి వీర శివకుమారస్వామికి చెక్కు అందించినట్లు కార్యనిర్వహణాధికారి బీవీ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

పలు ఘటనల్లో కేసు నమోదు

పీలేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని చెన్నారెడ్డి కాలనీకి చెందిన ఓ వృద్ధురాలిపై దౌర్జన్యం చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరుకు చెందిన అన్వేష్, శ్రావణ్, సాబీర్, శ్యామ్, మహేంద్ర అనే వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. అదే విధంగా ఆగస్టు 15వ తేదీ సాయంత్రం స్థానిక కడప మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలిగించడమే కాకుండా స్థానికులకు ఇబ్బందులు కలిగించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. విగ్రహ మంటపం వద్ద లోగోల ఆవిష్కరణ పేరుతో గ్యాస్ సిలిండర్‌తో పేపర్, పూలు రోడ్డుపై వెదజల్లుతూ ప్రజలకు కలిగిస్తుండడంతో ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఒక గ్యాస్ సిలిండర్‌తోపాటు ఒక పూలు వెదజల్లే మెషీన్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద కేసు దర్యాప్తు ముమ్మరం

- మృతుడి వివరాలు గుర్తింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని సీటీఎం గ్రామం రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని మృతదేహం వివరాలు వెలుగులోకి వచ్చాయని తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు పశ్చిమబెంగాల్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఖదీర్‌గా గుర్తించామన్నారు. పనులకోసం మదనపల్లె ఏరియాకు వలస వచ్చాడని, ఒంటిపై గాయాలు ఉండడంతో హత్య చేశారనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. రైల్వే బ్రిడ్జికు సమీపంలో మృతదేహం పడి ఉండడంతో ఎవరైనా రైల్ నుంచి తోశారా, లేక ప్రమాదవశాత్తు పడ్డారేమో అనే కోణంలో కదిరి రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పూర్తి వివరాల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మహిళ ఆత్మహత్య కేసులో ఇద్దరు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో అక్కాయపల్లె శాస్త్రినగర్‌లో నివాసముంటున్న సుభాన్‌బీ తనను భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనలో మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె భర్త బోధన చిన్న, మామ చిన్న సిద్దయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి.. రిమాండుకు తరలించినట్లు కడప తాలుకా సీఐ రెడ్డెప్ప తెలిపారు.

డాక్టర్ వైబీ రెడ్డి మృతి.. నేడు అంత్యక్రియలు


డాక్టర్ వైబీరెడ్డి

కడప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీ వాసి డాక్టర్ వైబీ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం 12.00 గంటలకు బెంగుళూరులో మృతి చెందారు. వైబీ రెడ్డి కడప 7 రోడ్స్‌లో దాదాపు 15 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో ప్రజలకు సేవలందించారు. అనంతరం గ్రానైట్ మైన్ ఓనర్‌గా పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈయనకు ఫాదర్ ఆఫ్ కడప మార్బుల్స్ అని బిరుదు కూడా ఉంది. ఈయన స్వగ్రామం సిద్ధవటం మండలం భాకరాపేట. భార్య, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్ళు ఉన్నారు. పెద్ద కుమార్తె కుటుంబం ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. చిన్న కుమార్తె కుటుంబం బెంగుళూరులో వ్యాపార రీత్యా ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు కడప హౌసింగ్ బోర్డు కాలనీలో వైబీ రెడ్డి స్వగృహం నుంచి అంతిమయాత్ర బయలుదేరి రామకృష్ణ హైస్కూల్ సమీపంలో గల హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


డాక్టర్ వైబీ రెడ్డికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంట్రాక్టర్ సింగారెడ్డి సుబ్బారెడ్డి

హామీ అమలయ్యేదెప్పుడో...!

- నీలాపురం వంకతో రాకపోకలకు ఇబ్బంది
- సుగాలితాండా ప్రజలకు ఇక్కట్లు


వంక ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

దువ్వూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురం-సుగాలి తాండా మధ్యలో ప్రవహిస్తున్న వంకతో ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వర్షాకాలంలో వంక నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. వంకకు పైతట్టు భాగంలో 600 ఎకరాలకు మేర రైతుల పొలాలు ఉన్నాయి. వంక మీదుగా తెలుగుగంగ జలాలు ప్రవహించి దువ్వూరు చెరువులోకి నీరు చేరుతుంది. ఈ నేపధ్యంలో వ్యవసాయ పనులు నిమిత్తం బండ్లు, ట్రాక్టర్లు, కూలీల ఆటోలు అటు వైపు వెళ్లాలంటే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను 15 ఏళ్లుగా ఎదుర్కొంటున్నా ఎవరికీ పట్టడంలేదు. రాకపోకలు సజావుగా సాగేందుకు వంక మీదుగా పైపులు వేసి నీటి ప్రవాహం వెళ్లే ఏర్పాట్లను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇది కొంతవరకు ప్రజలకు, రైతులకు ఉపశమనం కలిగించినా శాశ్వత పరిష్కారం లభించలేదు.

నాయకుల హామీలు నీటి మూటలేనా...

ప్రభుత్వాలు ఏవైనా నాయకుల హామీలు నీటి మూటలుగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా డీఎల్ రవీంద్రారెడ్డి ఉన్న సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో కలెక్టర్ కృష్ణబాబు కూడా ఈ సమస్యను పరిశీలించారు. తదనంతరం వైసీపీ ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డి రెండు దఫాలు కొనసాగిన సమయంలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. వంక మీదుగా చిన్నపాటి బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశ్యం అమలు కాలేదు. దీంతో ప్రజల ఇబ్బందికి పరిష్కారం లభించలేదు. ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ ఎన్నికయ్యాక ప్రజలు, నాయకులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపధ్యంలో సమస్య పరిష్కారానికి అతీగతి కనిపించడంలేదు. వంక ఉధృతి కొనసాగిన సమయంలో నాయకులు పరిశీలించడం, మాటలతో మమ అనిపించడం తప్ప సమస్య పరిష్కారం వైపు దృష్టి సారించడం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం దిశగా బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటడం పర్యావరణ హితం

తుంగా రమణయ్య



మొక్కలు నాటుతున్న తుంగా రమణయ్య

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కడప జనసేననాయకుడు తుంగా రమణయ్య అన్నారు. కడప మెగా అభిమాని బ్రహ్మం నాయక్ ఆధ్వర్యంలో కడప 18వ డివిజన్ ఏఎల్‌కాలనీలో సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కడప జనసేనపార్టీ నాయకుడు తుంగారమణయ్య, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పండ్రారంజిత్‌కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీలోని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలదాసు నాగరాజు,తిరుమలశెట్టి సిద్దార్థ్, తుంగాశ్రీను, తుంగా మధు, బాలునాయక్, కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గసేవలు అభినందనీయం

కడప కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని కాంగ్రిగేషనల్ చర్చి కమిటీ కార్యవర్గం అందిస్తున్న సేవలు అభినందనీయమని పాస్టర్ మోహన్‌బాబు కొనియాడారు. పాత రిమ్స్ వద్ద గల కాంగ్రిగేషనల్ చర్చి 200 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించి పలువురు క్రైస్తవ గురువులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. నాడు లండన్ మిషనరీ వారు ఏర్పాటు చేసిన ఈ చర్చి కాలగమనంలో అభివృద్ధి చెందుతూ భక్తుల ప్రార్థనలతో అలరారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ చర్చి కమిటీ చైర్మన్ సంజీవరాయుడు, కార్యదర్శి విజయుడు, ట్రెజరర్ నోవా బెన్నీ,రాజ మనోహర్‌బాబు, ప్రసన్నకుమార్, సుశీలమ్మ,చర్చి కమిటి ప్రతినిధులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రైనేజీ

- ●నెలల తరబడి పూడికతీత లేదు
- ●రక్షణ గోడ నిర్మాణం ఎప్పుడు.?
- ●దోమలు దుర్గంధంతో స్థానికులు విలవిల

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరాన్ని శుభ్రంగా ఉంచి నెంబర్‌వన్‌గా పెట్టాలని చెబుతుంటారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాది కడపకు రాష్ట్రంలో మూడోస్థానం లభించింది. అయితే ప్రథమస్థానం సాధనకు కృషిచేయాలని సిబ్బందికి పిలుపిస్తుంటారు. కడప నగరం శివారు ప్రాంతం మాత్రం మురికి కూపంలా ఉన్న పట్టించుకోరు. ఇదేనా కమిషనర్ సారు శుభ్రతపై మీరు తీసుకుంటున్నచర్యలు. ఇలానే ఉంటే సర్వేక్షణ్‌లో నగరం ప్రథమ స్థానం కాదు అదమ స్థానంలో ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కడప నగరం 48వ డివిజన్ హోమియోపతి కళాశాల రోడ్డులో గల ప్రధాన కాల్వలో పూడిక పేరుకుపోయి ఉంది. దీంతో దోమలు విపరీతంగా విజృంభిస్తున్నాయి. నెలల తరబడిపూడిక తొలగింపు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి పరిసరా లు దుర్గంధంతో నిండిపోయాయి. ఇటువైపు వెళ్లాలంటేనే ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. దోమలు విపరీతంగా ఉండడం వల్ల ఎప్పుడు ఏ రోగాలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ కాల్వ కు ఇంత వరకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని స్థానికులు తెలిపారు. ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా, కనీసం పూడికలు తీయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని, దీని వల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు వినతులు సమర్పించినా పూడిక తీసేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తెండి, వెంటనే పరిష్కరిస్తామంటూ ప్రజాప్రతినిధులు చెప్పడమే గాని, ఆచరణలో మాత్రం కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

రక్షణ గోడ నిర్మాణం ఎప్పుడో..: ఈ ప్రధాన కాల్వకు రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. అసలు ఈ కాల్వ నిర్మా ణం కూడా శాస్త్రీయంగా జరగలేదు. పులివెందుల రోడ్ నుంచి హోమియోపతి కళాశాల వరకు ఉన్న ఈ కాల్వలో మురుగు వెళ్లే మార్గమే లేదు. ఈ కాల్వను క్షుణ్ణంగా అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయాలి. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ కాల్వ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రక్షణ గోడ లేని కాల్వ, డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగు

బ్రౌన్‌గ్రంథాలయానికి బీరువా, పుస్తకాలు వితరణ

కడప మారుతీనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తప్పెట్ల కొత్తపల్లెకు చెందిన దివంగత మలిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెన్నా సిమెంట్స్ విశ్రాంత జనరల్ మేనేజరు ఎం.సుబ్బారెడ్డి ఆదివారం సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రానికి బీరువా, వంద పుస్తకాలు అందించారు. కాగా గ్రంథాలయానికి బీరువా, పుస్తకాలు వితరణ చేసిన సుబ్బారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్ర సంచాలకులు ఆచార్య పార్వతి, భూతపురి గోపాలక్రిష్ణ శాస్త్రి, వారిభూషణ రావు, రమేశ్‌రావు, ఆచార్య పద్మ తదితరులు ఉన్నారు.

మానసిక వికలాంగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

లింగాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగాల సమీపంలోని దీనబంధు మానసిక వికలాంగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఆదివారం బీజేపీ సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్ జన్మదినం పురస్కరించుకొని బీజేపీ నాయకులు,కార్యకర్తలు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ మాజీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శివానందపురం రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా మారిందని, ప్రజల సౌకర్యార్థం కోసం ఈ దారిని సీసీ రోడ్డు వేయాలని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. ఆదివారం 15వ డివిజన్ శివానందపురంలోని రోడ్డును ఆ ప్రాంత రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఆర్‌సీపీ బృంద సభ్యులు పర్యటించారు. రహదారికి వెంటనే మరమ్మతులు చేసి శాశ్వతమైన సిమెంట్ రోడ్డును వేయాలని డిమాండ్ చేశారు.

రైతు శ్రేయస్సు కోసం పాటుపడాలి

- ● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చెన్నూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. చెన్నూరు సహకార పరపతి సంఘం చైర్మన్‌గా శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్లుగా నీలం గోవిందరెడ్డి, మాకం వెంకటసుబ్బయ్యను డీసీవో వెంకట సుబ్బయ్య ఆదివారం సాయంత్రం చెన్నూరులో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వపరంగా నామినేటెడ్ పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పుత్తానరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు మండలంలో ఇప్పటి వరకు తక్కువ రుణం అందించడం జరిగిందన్నారు. ఈ మారు 20 నుంచి 25 కోట్ల మేర రుణాలు అందించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రైతులు, టీడీపీ నాయకులు మండల కన్వీనరు విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ సభ్యులను ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామకోటిరెడ్డి, ఆకులప్రసాద్ బాబు, రామక్రిష్ణారెడ్డి, షేక్ ముక్తియార్, ఆవుల పవన్ కుమార్‌రెడ్డి, షబ్బీర్‌హుస్సేన్, ఆకుల చలపతి, మన్నూరు అక్బర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా గడువు పొడిగింపు

వీరపునాయునిపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దిగుబడి ఆధారిత పంటలకు బీమా గడువు ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఏఓ శ్యామ్‌బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభంతో పొంచి ఉన్న ప్రమాదం



లింగాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పార్నపల్లె వద్ద నిర్మించిన వాటర్‌గ్రిడ్ పథకానికి 33 కేవీ విద్యుత్ లైన్‌కొత్తగా ఏర్పాటుచేశారు. అయితే లోపట్నూతల కర్ణపాపాయపల్లె గ్రామాలమధ్య ఒక విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒక పక్కకు అరటిపొలంలోకి ఒరిగిపోయింది.ప్రమాదం జరగక మునుపే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదానం మహాదానం



వేంపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదానం మహాదానమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. వేంపల్లె గండిరోడ్డులోని నాగమ్మనగర్ మదర్‌థెరిస్సా ఆశ్రమంలో కాంగ్రెస్ నాయకుడు రవికుమార్ కవలపిల్లలు కేతన, కేతన్‌ల పుట్టిన రోజు సందర్భంగా తులసిరెడ్డి చేతులమీదుగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బుగ్గవంకపై బ్రిడ్జీలు నిర్మించాలి

కడప కలెక్టరేట్, ఆగస్టు 17(ఆంధ్ర జ్యోతి): నగరంలోని బుగ్గవంక,షామీరియా, లా కళాశాల బ్రిడ్జీలను వెంటనే నిర్మించాలని కాంగ్రెస్ యువజనవిభాగం నాయకుడు జాకీర్, పీసీసీ మాజీ నేత ఎస్ఎసత్తార్ డిమాండ్ చేశారు. బుగ్గవంకపై ప్రజల రాక పోకలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే బ్రిడ్జీలు నిర్మించాలని ఆదివారం కాంగ్రెస్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సత్తార్ మాట్లాడుతూ 2001లో బుగ్గవంక వరదల కారణంగా నగరంలో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. కాగా అప్పటి నుంచి ప్రభుత్వాలు బ్రిడ్జీలపై నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాసీర్ చంద్రశేఖర్‌రెడ్డి, జహీర్, అలీ అబ్బర్,రహమతుల్లా, కమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన పింఛన్‌మార్చ్‌ను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన పింఛన్ విధానం అమలు అయిన సెప్టెంబర్ ఒకటిని సీపీఎస్ రద్దు కోరుతూ విజయవాడలో తలపట్టిన పింఛన్ మార్చ్‌కు జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు అందరు హాజరై విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్దనరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకిరెడ్డిపల్లె మదన్‌మోహన్‌రెడ్డి, బి.ఖాదర్‌బాష ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోపు సీపీఎస్ సమస్యకు ఒక పరిష్కారం చూపుతామని చెప్పి నేడు గద్దెనెక్కి సంవత్సరం గడిచిన కూడా సీపీఎస్ రద్దు మీద ఎటువంటి ప్రకటన చేయకపోవడం చాలా బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.

చెత్త పన్ను అవకతవకలలో ఆప్కాస్ కార్మికులకు అన్యాయం

ఏఐటీయూసీ

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడపనగర పాలక సంస్థ పరిధిలో చెత్త పన్ను వసూళ్లలో జరిగిన అవకతవకలలో ఆప్కాస్ చిరు కార్మికులను తొలగించి పర్మినెంట్ కార్మికులను మాత్రం సస్పెండ్ చేయడం ఏమిటని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా ప్రశ్నించారు. ఆదివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాదుల్లా మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం చట్ట విరుద్ధమని, అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకల్లో జరిగిన సొమ్ము కార్మికులు, ఉద్యోగుల నుంచి రికవరీ చేసి తొలగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయడంతో పాటు తొలగించినవారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా ఇంటి శుభ్రత..మాదే బాధ్యత



ఎక్కడైనా కాల్వలను శుభ్రం చేసేది పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్, అయితే ఇక్కడ మాత్రం భిన్నంగా సాగుతోంది. కడప నగరం లోని కట్టకింద హరిజనవాడలో మురుగుకాల్వలను శుభ్రం చేసే వారు లేకపోవడంతో తమ పిల్లల చేత మురుగు కాల్వలను శుభ్రం చేయించుకుంటున్నారు. దీనిపై స్థానికులు మాట్లాడుతూ ఎప్పుడో ఒకసారి వచ్చి పారిశుధ్య కార్మికులు పోతుంటారని, ప్రస్తుతం చినుకులు కురుస్తున్న వేళ దోమలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో మా ఇళ్ల ముంగిట మేమే శుభ్రం చేసుకోవా ల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నగర పాలక అధికారులు విష యాన్ని గుర్తించి పారిశుధ్య కార్మి కులను పంపించాలని స్థానికు లు కోరారు.

స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కడప.

ఇంటి ముందు మురుగు కాల్వలు తీస్తున్న విద్యార్థులు

గంగమ్మకు పూజలు



సీకేదిన్నె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి నూతన వస్త్రాలు, పూలదండలతో అలంకరించారు. అనంతరం మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో బంధుమిత్రులతో కలిసి విందు బోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా హరిహరనాథ్

వీరపునాయునిపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) వీరపునాయునిపల్లె మండల కార్యదర్శిగా కొమెర హరిహరనాథ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ కమలాపురం ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం జరిగిన మండల సమితి సమావేశంలో ఎన్నిక జరిగినట్లు తెలిపారు. అలాగే సహాయ కార్యదర్శిగా బ్రహ్మం, కమిటీ సభ్యులుగా గంగయ్య, బడుగు రవి, బాలచంద్ర ఎన్నుకున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

●ఎమ్మెల్యే సమక్షంలో 150 కుటుంబాలు టీడీపీలో చేరిక



పెండ్లిమర్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. నందిమండలం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ నుంచి 150 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేజర్ పంచాయతీ నందిమండలంలో ఇంత మంది ఒకేసారి పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను మెయిన్‌రోడ్డు నుంచి భారీ ఊరేగింపుగా బాణాసంచా పేల్చుతూ బ్యాండుతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి,క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి,సింగిల్ విండో అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, నాయకులు శ్రీనివాసులరెడ్డి,పంగా చంద్రశేఖర్, మయూర్‌రెడ్డి, ఆంజనేయులు, అమర్, అన్నమయ్య, సారథి,ఈశ్వర్‌రెడ్డి, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీ కింద జోరుగా వరినాట్లు


దువ్వూరు కేసీ ఆయకట్టు కింద వరినాట్లు వేస్తున్న కూలీలు


వరినారుకు యూరియా చల్లుతున్న రైతు


రాజుపాలెంలో పత్తి పంటలో ఉన్న కలుపును సేద్యం ద్వారా తొలగిస్తున్న దృశ్యం

దువ్వూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌కు నీరు రావడంత ఆయకట్టు పరిధిలో వరినాట్లు జోరందుకున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో కాలువకు ముందుగా నీరు రావడంతో రైతులు నారుదొడ్లు పోయడం, ఎదిగిన నారును నాటడం, జరుగుతోంది. నియోజకవర్గంలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేటతోపాటు రాజుపాళెం పరిధిలో వరినారుమళ్లు ఊపందుకున్నాయి. ఆయకట్టు పరిధిలో వరి పంట ప్రధానంగా సాగు చేస్తారు. ప్రతి ఏటా ఆగస్టు మధ్యలో కేసీ కాలువకు నీరు అందేది. ఈఏడు వర్షాలు సహకరించడంతో ప్రాజెక్టులు నిండి ముందుగానే నీరు రావడంతో ఈ ఏడు 20 నుంచి 25 రోజులు ముందుగానే వరినాట్లు వేసే పనులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో పొలాలను ట్రాక్టర్లతో దమ్ము చేస్తున్నారు. వసతిని బట్టి దమ్ముతోపాటు ఎద్దులతో మాను తోలి పొలాన్ని చదరగట్టి గనేలు వేస్తుండగా కూలీలు నాటు వేయిస్తుండడంతో పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్నాయి. నాట్లు వేసే ముందు ఎరువులను పొలంలో చల్లుతున్నారు.

పెరిగిన పెట్టుబడులు: వరిసాగుకు పెట్టుబడులు పెరిగాయి. విత్తనం వడ్లు కొనుగోలు, పొలాన్ని దుక్కి చేయడం తదనంతరం నీరు పెట్టి దమ్ము చేయడం, రసాయనిక ఎరువుల కొనుగోళ్లు, నాట్లు వేసే కూలీల ఖర్చు, గెనెల తయారీ, ఇతరత్రా పెట్టుబడుల కింద ఖర్చు అధికంగా వస్తోందని రైతులు అంటున్నారు. వ్యాపారులు ఎరువుల ధరలను ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఏయేటా సాగు ఖర్చు పెరుగుతున్నాయనేది రైతులు వెలిబుచ్చుతున్న అభిప్రాయం.

24 వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం

మైదుకూరు డివిజన్ పరిధిలో ఈ ఏడు 24 వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దువ్వూరు పరిధిలో 6,500 ఎకరాల్లో, మైదుకూరు 3 వేల ఎకరాలు, చాపాడు 12 వేల ఎకరాలు, రాజుపాళెం 1800 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఖాజీపేట ప్రాంతంలో కూడా విస్తృతంగా వరి సాగుకు పూనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా పనులు మొదలవుతుండడంతో కూలీలకు గిరాకీ పెరిగింది.

సాగైన పంటలకు ఊరట కలిగించిన వర్షం

రాజుపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడుతుండడంతో సాగైన పత్తి తదితర పంటలకు కాస్త ఊరట లభించింది. మండలంలో దాదాపు 250 ఎకరాల పైబడి పత్తిపంటను సాగు చేసిన రైతన్నలకు మొలక దశలోనే ఎండిపోతోంది. అయితే గత మూడురోజులుగా ఒక మోస్తరు వర్షం పడుతుండడంతో సాగైన పంటలకు మేలుచేకూరింది. కాగా వర్షాలు జోరందుకుంటే జొన్న, మినుముపంటలు సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.

నూతన ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలంలోని గురప్పగారి పల్లె గ్రామంలో శ్రీమద్దిమాను గురప్పస్వామి దేవస్థానానికి సంబంధించి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని కార్యనిర్వాహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు. ఇందులో మెంబరు, సెక్రటరీ, ధార్మిక పరిషత్ నుంచి ఏపీ విజయవాడ వారు నోటిఫికేషన్ జారీ చేసి యున్నారని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని 50 శాతం మహిళలకు వారిలో ఒకరు ఎస్సీ, ఒకరు ఎస్టీ, ఇంకొకరు నాయీ బ్రాహ్మణులు తప్పనిసరి అని, మొత్తం 9 మందితో కూడిన దరఖాస్తు చేసుకునేవారు జిల్లా దేవదాయశాఖాధికారి కార్యాలయం, కడప వారికి 25 రోజుల్లోపు సమర్పించాలని కార్యనిర్వాహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు.

పోలీసుల సేవలు అభినందనీయం


బదిలీపై వెళుతున్న పోలీసులను సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐలు

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 17(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న పోలీసుల సేవలు అభినందనీయమని సీఐ కె నరసింహారెడ్డి, ఎస్ఐ చిరంజీవి పేర్కొన్నారు. స్థానిక ఏ1 కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బదిలీపై వెళుతున్న ఐదుగురు పోలీసులకు సీఐ, ఎస్ఐలు పూలమాల వేసి,శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు.

బోరు పైపుల విషయమై దాడి

ముద్దనూరు ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):మండల పరిధి ఆరవేటిపల్లె గ్రామంలో ఆదివారం బోరు పైపుల విషయంలో కత్తెం శివ అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు పై దాడి చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆంజనేయులుకు చెందిన బోరు పైపు కత్తెం శివకు కొద్ది రోజుల క్రితం ఇచ్చాడు. అయితే తన పైపులు ఇవ్వాలని అడుగగా ఇచ్చేది లేదంటు ఆంజనేయులు పై శివ దాడి చేశాడు. ఈ దాడిలో ఆంజనేయులుకు తలకు గాయమైంది. బాధితుడి భార్య రామసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాదయాత్రగా గురప్పస్వామి కొండకు వెళ్లిన భక్తులు


పాదయాత్రను ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గురప్ప

జమ్మలమడుగు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలంలోని గురప్పస్వామి ఆలయం వద్దకు 200 మంది భక్తులు పాదయాత్రగా వచ్చారు. ఆదివారం జమ్మలమడుగుకు చెందిన మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్, కూటమి నాయకులు మూలింటి గురప్ప పాదయాత్రను ప్రారంభించారు. వారు ఇరుముడి మొక్కుబడి చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురప్పస్వామి కమిటీవారు షేట్ గురివిరెడ్డి, దేవస్థాన అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

చాపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పల్లవోలు గ్రామం వద్ద ఉన్న కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం యూనియన్ నాయకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ ప్రింట్‌మీడియా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, గౌరవాధ్యక్షుడు వేపరాల వెంకటసుబ్బయ్య, కోశాధికారి సునీల్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, రవికల్యాణ్, పాల్గొన్నారు.

కొత్త సీఐకి సమస్యల స్వాగతం

జమ్మలమడుగు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ సీఐగా ఎర్రగుంట్ల నుంచి బదిలీపై వస్తున్న కొత్త సీఐ నరేష్‌బాబుకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి, ఇటీవల జరిగిన బదిలీల్లో జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప బద్వేలుకు బదిలీ కాగా ఎర్రగుంట్ల నుంచి జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌కు సీఐ నరేష్‌బాబు బదిలీపై రానున్నారు. జమ్మలమడుగు అసాంఘికాలకు అడ్డాగా మారింది. పట్టణం, గ్రామాల్లో సైతం పేకాట, మట్కా జోరుగా సాగుతోంది. అలాగే గండికోట రిసార్ట్‌లలో కొందరు ఏకంగా బాడుగలకు తీసుకుని పేకాట నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇక పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. అలాగే ఊరూరా బెల్టుషాపులు పెరిగిపోయాయి. ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా రోడ్డుకు ఇరువైపుల వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఖాజీపేటలో 29.4 మి.మీ. వర్షం

ఖాజీపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 29.4 మి.మీ. వర్షపాతం నమోదు అయిందని తహసీల్దారు ఏవీ రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అధికంగా పడుతుండడం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రోడ్డు వేయాలంటూ డీవైఎఫ్ఐ వినూత్న నిరసన


బురదనీటిలో వరినాట్లు వేసి వినూత్నరీతిలో నిరసన తెలిపిన డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మరాజుపల్లె గ్రామానికి రోడ్డు వేయాలంటూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బురదరోడ్డులో మహిళలతో కలిసి వరినాట్లు వేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, గ్రామస్థుడు రామరాజులు మాట్లాడుతూ తిమ్మరాజుపల్లెకు సరైన రహదారి లేక చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయమవుతోందన్నారు. గ్రామంలో దాదాపు 150 కుటుంబాలు 400 పైగా జనాభా నిత్యం ఈ రహదారి గుండా బద్వేలుకు వస్తూ పోతుంటారని, ఈ క్రమంలో పలుమార్లు కిందపడి గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీరోడ్డు ఏర్పాటు చేయా లని లేదంటే గ్రామస్థులతో కలిసి డీఐఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు యువరాజ్, గ్రామస్థులు గురు శశికుమార్, వినయ్, వెంకటరమణ, జయరామయ్య మహిళలు పాల్గొన్నారు.

పంట కాల్వలను తలపిస్తున్న రహదారులు



నీటిప్రవాహంలో వెళుతున్న కారు

పోరుమామిళ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లోని రహదారులు పంట కాల్వలను తలపిస్తున్నాయి. వాహనదారులు అందులో ప్రయాణించి కింద పడుతున్నారు. ముఖ్యంగా పోరుమామిళ్లలోని మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో డ్రైనేజీ కాల్వల నిర్మాణం జరగక నీరంతా రోడ్లపై నిలిచి వాహనదారులు, పాదాచారులకు అసౌకర్యంగా మారింది. ఆర్టీసీ బస్టాండు వద్ద సిమెంటు రోడ్డు ఒక వైపే వేయడం, మరో వైపు నిర్మాణానికి నోచుకోకపోవడంతో అక్కడ గుంతల్లో వర్షం నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో రోడ్డుపై ఎక్కడ గుంతలున్నాయో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. గతంలో ఆదిఆంధ్రపాలెం వెళ్లు రహదారికి సంబంధించి రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు అందినా అధికారుల ఉదాశీనత, రాజకీయాల కారణంగా ఆక్రమణలు తొలగక నిర్మాణాలన్నీ ఎత్తులో ఉండడం, డ్రైనేజీ కాల్వలేక అసలు పడుతున్నామని ఆయాపంచాయతీల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చి డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారు వ్యాపారుల నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు బంగారు వ్యాపారుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం బుశెట్టి ఫాంహౌస్‌లో బంగారు వ్యాపారులు నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పర్తి మధుసూదన్, ఉపాధ్యక్షుడిగా బుశెట్టి రాజశేఖర్, కార్యదర్శిగా కేవీ చలపతి, జాయింట్ సెక్రటరిగా కలవల మహేష్‌కుమార్, కోశాధికారిగా మేడా మధుసూదన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొప్పర్తి మధుసూదన్, కార్యదర్శి బుశెట్టి రాజశేఖర్‌లు మాట్లాడుతూ పట్టణంలో బంగారు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు వ్యాపారులు పాల్గొన్నారు.

వెలగని విద్యుత్ దీపాలు.. ఇబ్బందుల్లో ప్రజలు


కొండాపురంలో హైవేపై రాత్రిపూట వెలగని విద్యుత్ దీపాలు

కొండాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల పూర్తయిన ముద్దనూరు-తాడిపత్రి నేషనల్ హైవే-67 పై ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవేపై కొండాపురం పట్టణంలో రోడ్డుకు ఇరువైపుల ఏర్పాటుచేసిన విద్యుత్‌లైట్లు అంకారప్రాయంగా ఉన్నాయి. విద్యుత్‌లైట్లు వెలగకపోవడంతో రాత్రిపూట ప్రజలు అటుఇటూ రోడ్డు దాటుకునేటప్పుడు ఇబ్బందిపడుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. టోల్‌గేట్ ఏర్పాటుచేసి నెలనుంచి టోల్ ఫీజు వసూలు చేస్తున్న ఇంతవరకు లైట్లు వెలగకపోవడంపై స్థానికలు మండిపడుతున్నారు.ఈ లైట్లకు సంబంధించి ఇంతవరకు విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు చేయలేదని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. వెంటనే విద్యుత్‌లైట్లు వెలగకపోతే స్థానికులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు.

సిరాజుద్దీన్ సేవలు అభినందనీయం


సిరాజుద్దీన్‌ను సన్మానిస్తున్న రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ సాధు గోపాలక్రిష్ణ

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జోనల్ ఆఫీసర్ స్టార్ ఫౌండేషన్ ఎన్జీవో అధ్యక్షుడు ఎస్కే సిరాజుద్దీన్ సేవలు అభినందనీయమని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ సాధు గోపాలక్రిష్ణ అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ తరుపున సన్మాన సమ్మేళన్ డిస్ట్రిక్ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిరాజుద్దీన్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. సామాజిక రంగంలో సిరాజుద్దీన్ అవిరళ కృషికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఇందు కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణానికి విశేష ఆదరణ

- 34.68 శాతం మహిళలు ప్రయాణించారు
- ఆర్టీసీ డీఎం వెల్లడి
- పాత ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేసుకోవాలి
- జిరాక్స్‌లు చెల్లవు


ఉచిత బస్సులో ఆధార్‌కార్డును పరిశీలిస్తున్న కండక్టర్

జమ్మలమడుగు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యానికి విశేష ఆదరణ లభిస్తోందని జమ్మలమడుగు ఆర్టీసీ వర్గాలు వెల్లడించాచి. జమ్మలమడుగు నుంచి, మైలవరం మండలంలోని ఆర్టీసీ బస్సు సర్వీసు ఉన్న గ్రామాల నుంచి మహిళలు ఆదివారం ఉదయం నుంచి కొంత శాతం పెరిగారు. జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డు మార్గంలో కూడా ఎక్కువగా మహిళలు ప్రయాణించారు. జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల ప్రాంతాలకు ప్రయాణించడంతో దాదాపు ఒక్కొక్కరు రూ.100 నుంచి రూ.120 తమకు ఆదా జరిగిందని మహిళలు తెలిపారు. అయితే జమ్మలమడుగు నుంచి తాడిపత్రి, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ప్రాంతాలకు సైతం మహిళలే అధికంగా ఉన్నట్లు ఆర్టీసీ వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే మహిళలు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఓటరు ఐడీ కానీ తెచ్చుకోవాలని కండక్టర్లు కోరుతున్నారు.

నాన్‌స్టాప్ సర్వీసుల్లో స్త్రీశక్తికి అనుమతి ఇవ్వాలి

జమ్మలమడుగు-ప్రొద్దుటూరు నాన్‌స్టాప్ సర్వీసుల్లో మహిళలకు స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి ప్రతి ఏ చిన్న పని పడినా ఎక్కువ మంది ప్రొద్దుటూరుకు వెళ్లాల్సి వస్తోందని అందువల్ల ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆర్టీసీ డీఎం ఏమన్నారంటే: ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంపై జమ్మలమడుగు ఆర్టీసీ డీఎం ప్రవీణ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రెండు రోజుల్లో 34.68 శాతం మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారన్నారు. సోమవారం నుంచి ఇంకా రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. జమ్మలమడుగు- ప్రొద్దుటూరు మధ్య నడిచే నాన్‌స్టాప్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చెన్నంరాజు పల్లె పీఏసీఎస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి


పల్లేటి చంద్రశేఖర్ రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం చెన్నంరాజు పల్లె ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా పల్లేటి చంద్రశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఆమేరకు ఆదివారం డీసీసీ బ్యాంకు ఆవరణలో చైర్మన్‌గా పల్లేటి చంద్రశేఖర్‌రెడ్డి డైరెక్టర్లుగా వెంకటసుబ్బయ్య, రాజేశ్వరిలతో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన పల్లేటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణ సదుపాయం అందించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం చైర్మన్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

తెగిపడిన కరెంట్ తీగలు .. తప్పిన ప్రమాదం


దారికి అడ్డంగా తెగిపడిన కరెంట్ తీగను చూపిస్తున్న ప్రజలు

కాశినాయన ఆగష్టు 17(ఆంధ్రజ్యోతి): పిట్టిగుంట గ్రామం నుంచి బస్టాప్ వెళ్లే ప్రదాన రహదారిపై ఆదివారం తెల్లవారు జామున విద్యుత్ వైర్లు దారికి అడ్డంగా తెగిపడ్డాయి. అయితే ఆ సమయంలో జనం అటువైపు వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. సమీప గృహానికి చెందిన వ్యక్తి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు ముఖ్యంగా పిట్టిగుంట- చెన్నారెడ్డిపల్లె గ్రామాల మధ్య రాకపోకలు ఎక్కువగా జరుగుతుంటాయి. అదృష్టవశాత్తు తెల్లవారుజాము కావడం చిరు జల్లులు పడుతుండటంతో జనాలు ఎవరూ ఇంటి నుంచి బయటికి రాకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. గతంలో కూడా రెండుసార్లు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని తెగిన ప్రతిసారి విద్యుత్ సిబ్బంది అతుకులు వేయడంతప్ప కొత్తలైను లాగడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు

వైభవంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు




జమ్మలమడుగు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక జమ్మలమడుగు కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఆదివారం శ్రీకృష్ణ భగవానుడు ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, త్రైత సిద్ధాంత కమిటీవారు రంగనాయకులు, నరసింహ, నాగరాజు, శివ, సందీప్, చలపతి, లక్ష్మీదేవి, రాజేశ్వరి, రమణమ్మ, మల్లీశ్వరి ఊరేగింపు వెంట నడిచారు. పురవీధుల్లో అడుగడుగునా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చేతివృత్తిదారులకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ భాస్కర్

బద్వేలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారులకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలని చేతివృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో చేతివృత్తిదారులతో సమావేశంలో ఆయన మాట్లాడతూ వృత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పిన మాట నెరవేరలేదన్నారు. అలాగే వివిధ కార్పొరేషన్ల ద్వారా వృత్తుల్లో ఉన్నవారికి 90 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని అన్ని వృత్తులో ఉన్న వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టి ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 31న బద్వేలులో పెద్ద ఎత్తున సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో చేతివృత్తిదారుల సంఘం పట్టణ కన్వీనర్ నాగార్జున, రజకవృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు క్షౌర వృత్తిదారు సంఘం నాయకులు ఓబులేసు, మేదర సంఘం నాయకులు వెంకటేశ్వరు, చర్మకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిశోధనలో ప్రభుత్వ భాగస్వామ్యం పెరగాలి


మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పరిశోధన రంగంలో ప్రభుత్వ భాగస్వామ్యం పెరగాలని జేవీవీ జిల్లా కార్యదర్శి హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం జేవీవీ కార్యాలయంలో పట్టణ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరిగే పాఠ్యాంశాలను తొలగించడం దారుణమన్నారు. జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతోందని దీనిని తగ్గించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, జిల్లా కోశాధికారి సుబ్బయ్య, సునీత, డాక్టర్ చక్రధర్, సూర్యనారాయణరెడ్డి, నరేష్, రాజేష్, ఉషారాణి, వరలక్ష్మి పాల్గొన్నారు.